క్లుప్తంగా

నేతాజీ జయంతి వేడుకలు



సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, గీసుకొండ మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, ముఖ్యకూడళ్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల నిర్వాహకులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ దేశ స్వాతంత్య్ర పోరాటంలో చేసిన త్యాగాలను స్మరించారు.

కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన పాలన

పర్వతగిరి : కాంగ్రెస్‌తోనే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని చౌటపల్లిలో ఆయన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అలాగే మూడెత్తుల తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

కాటమయ్య కిట్ల పంపిణీ



పర్వతగిరి : మండల కేంద్రంలోని కాటమయ్య గుడి ఆవరణలో మండలంలోని 19 గ్రామాలకు చెందిన గౌడ కులస్తులకు ఎక్సైజ్ సిబ్బంది గురువారం కాటమయ్య కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు దొమ్మటి లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడారు. గీత కార్మికులు కిట్లను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బండి సతీశ్, కార్యవర్గ సభ్యులు జనగాం వెంకటేశ్వర్లు, కార్యదర్శి చీకటి సాయిలు, చీకటి శ్రీధర్, బండి బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

నల్లబెల్లి : వ్యవసాయ బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రంగాపురంలో చోటు చేసుకుంది. స్థానికుల, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాల్వ మల్లారెడ్డి (80) గురువారం తెల్లవారుజామున తన ఇంటి సమీపంలోని పాత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లారెడ్డికి ఇద్దరు కొడుకులుండగా పెద్ద కొడుకు వద్ద హైదరాబాద్‌లో కొంత కాలం ఉండి నెల రోజుల క్రితమే గ్రామంలోని చిన్న కొడుకు ప్రభాకర్‌రెడ్డి దగ్గరకు మల్లారెడ్డి వచ్చాడు. సుమారు ఆర్నెళ్ల క్రితం భార్య మృతి చెందగా ఆ వేదనతోనే మల్లారెడ్డి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రచారంలో ఉంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

విరాళం



సంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాటుకు గీసుకొండ మండలంలోని మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాల్‌రెడ్డి గురువారం రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్‌రెడ్డి మధ్యాహ్న భోజనం వడ్డించి మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో గోపు మర్రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బండి విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందించేందుకు..



వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గణతంత్ర దినోత్సవాన్ని ఆటల పోటీల సందర్భంగా బహుమతులు అందించడానికి బొజ్జ సురేందర్, యాంసాని శ్రీధర్, భూమా రమేశ్, తదితరులు రూ.8 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సాదు రమేశ్‌కు దాతలు నగదు అందించగా ఆయన స్వీకరించి మాట్లాడారు. హైస్కూల్ విద్యార్థుల కోసం రూ.6 వేలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం రూ.2 వేలు విరాళం ఇచ్చారని చెప్పారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాతలు ఎస్.శ్రీనివాస్, అడ్డగూడి రవి, అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు కుమారస్వామి, శ్రీనివాస్, సురేశ్, రహీం పాల్గొన్నారు.

చెన్నారావుపేట : సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



పర్వతగిరి : దౌలత్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యేలు మాధవరెడ్డి, నాగరాజు
- సభల్లో వాగ్వాదం, నిరసనలు

సాక్షి నెట్‌వర్క్ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తామని నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు తెలిపారు. జిల్లావ్యాప్తంగా గ్రామసభలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా చెన్నారావుపేట మండలంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి, పర్వతగిరి మండలంలో ఎమ్మెల్యే నాగరాజు సభలకు హాజరై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ ఇచ్చిన హామీ మేరకు పథకాలు వర్తింపజేస్తామని చెప్పారు. లబ్ధిదారుల జాబితాలో అర్హుల పేర్లు లేకుండా దరఖాస్తు చేయాలని సూచించారు. అనర్హుల పేర్లు ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. దళారులను ఆశ్రయించొద్దని స్పష్టం చేశారు. సమస్యలు ఉన్నా పథకాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగినా టోల్ ఫ్రీ నంబర్ 8096107107కి కాల్ చేయాలని తెలిపారు.

నిరసనలు

చెన్నారావుపేటలో బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. నెక్కొండ మండలంలోని సూరిపల్లి సభలో ఫ్లెక్సీపై ఎంపీ పోరిక బలరాం నాయక్ ఫొటో లేదంటూ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు గుగులోతు నరేశ్‌నాయక్ అధికారులను నిలదీశారు. దుగ్గొండి, ఖానాపూర్ మండలాల్లో బీఆర్‌ఎస్–కాంగ్రెస్ నాయకుల నడుమ తోపులాట చోటు చేసుకుంది. సంగెం మండలంలోని కుంటపల్లిలో నిర్వహించిన సభలో ఏఈఓ జాబితా చదువుతుండగా ఆకుల రాజయ్య అనే రైతు దుర్భాషలాడారు.



నెక్కొండ : మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కౌసల్యదేవి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ



నల్లబెల్లి : ముచ్చింపులలో..



దుగ్గొండి : బొబ్బరోనిపల్లిలో..



చెన్నారావుపేట : ఖాదర్‌పేటలో..

మేరు కులస్తుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : మేరు కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని మేరు సంఘం భవనంలో మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద మేరు కులస్తులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో చొరవ తీసుకుంటామని చెప్పారు. పట్టణంలోని సంఘం భవన నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. స్కూల్ యూనిఫాం కుట్టు పని మేరు కుల సంఘాలకు మాత్రమే అందేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడారు. దేశంలో ఎవరి కుల వృత్తిని వారే చేసుకుంటుండగా మేర కుల వృత్తిని అన్ని కులాల పేదలకు నేర్పించేలా ప్రభుత్వం శిక్షణ ఇప్పిస్తోందని, కుట్టు మిషన్లు ఉచితంగా ఇస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. మేర కులస్తులు మాత్రమే కుల వృత్తి చేసేలా, పేద మేర కులస్తులకు మాత్రమే శిక్షణ, కుట్టుమిషన్లు ఉచితంగా ఇచ్చేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మేరు సంఘం రాష్ట్ర నాయకులు తాళ్ల సంపత్‌కుమార్, బొలుకొండ రవితేజ, గూడూరు బాలాజీ, కర్నె రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోమకొండ శ్రీనివాస్, కోశాధికారి రామగిరి యాదగిరిస్వామి, జిల్లా ముఖ్యసలహాదారు గట్ల నాగేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు రామగిరి రవికుమార్, నాయకులు వోడపల్లి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గొల్ల కురుమల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధూకర్, జిల్లా కమిటీ సభ్యులు జక్క రవి, పోతారబోయిన చంద్రమౌళి, జక్క వెంకటేశ్వర్లు, కుక్కల అశోక్, కుండె రాజ్‌కుమార్, బొల్లబోయిన రాంచందర్, స్వామి, ఉడుగుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి బహుమతిగా పుస్తకాలు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వెల్దండి సుమలతకు నేషనల్ బుక్ ట్రస్ట్ నుంచి బహుమతిగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి రూ.10 వేల పుస్తకాలు అందాయి. గతేడాది సుమలత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన క్రమంలో రాష్ట్రం నుంచి నేషనల్ జ్యూరీ స్థాయికి ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఆమెకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్‌లో శాశ్వత సభ్యత్వం కల్పిస్తూ పోస్టు ద్వారా పాఠశాలకు పుస్తకాలు పంపింది. ఈ సందర్భంగా సుమలతను హెచ్‌ఎం జూలూరి జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు మధుసూదన్, శ్రీనివాస్, గీత, సుధీర్‌కుమార్, మాధవరావు, కమల, వెంకన్న, ప్రదీప్ అభినందించారు.

'యాసంగి'కి సాగునీరు



నల్లబెల్లి : యాసంగి పంటలకు సాగునీరు అందిస్తామని మెగా కంపెనీ ఇంజనీర్ ఆదినారాయణ తెలిపారు. సాగునీటి కోసం రైతులు నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డిని కలవగా ఆయన ఆదేశాల మేరకు ఇంజనీర్లు కాల్వలకు గురువారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఇంజనీర్ ఆదినారాయణ మాట్లాడారు. మేడపల్లి, మామిండ్ల వీరయ్యపల్లి రైతులకు దేవాదుల పైపులైన్ ద్వారా సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెగా కంపెనీ ఇంజనీర్లు అనిల్, శివకుమార్, మాజీ ఎంపీటీసీలు జిల్లా మునేందర్, అంజలి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల యాజమాన్యాల నిర్లక్ష్యం

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దయాకర్

నర్సంపేట : ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల కూలీ పెంపు విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ విమర్శించారు. ఆ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట కార్మికులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. ఇటుక బట్టీల్లో కార్మికులకు పనికి తగిన కూలీ అందడం లేదన్నారు. కూలీ పెంపు కోసం యాజమాన్యాలకు గతేడాది డిసెంబర్ 18న నోటీసు ఇచ్చినా స్పందించలేదని ఆందోళన వెలిబుచ్చారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఇటుక బట్టీ కార్మికులకు వెయ్యి ఇటుకలకు రూ.1300 చొప్పున కూలీ ఇవ్వాలని, పండుగలకు రూ.5 వేల చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటుక బట్టీల యాజమాన్యాల తీరుపై ప్రభుత్వం విచారణ చేపట్టి కూలీలకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ స్థానిక ఏరియా కమిటీ అధ్యక్షుడు బరిగల కుమార్, నాయకులు గొర్రె ప్రదీప్, సూరయ్య, రవీందర్, శైలజ, కరుణాకర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దయాకర్, నాయకులు

గంగదేవిపల్లిలో అధ్యయనం



గీసుకొండ : జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన మండలంలోని గంగదేవిపల్లిలో సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలంలోని అబ్బెంద గ్రామస్తులు గురువారం అధ్యయనం చేశారు. యునైటెడ్ వే ముంబాయి అనే స్వచ్ఛంద సంస్థ అబ్బెంద గ్రామాన్ని దత్తత తీసుకున్న క్రమంలో ఫీల్డ్ విజిట్‌లో భాగంగా గ్రామస్తులను గంగదేవిపల్లికి తీసుకొచ్చి గ్రామంలోని వ్యవసాయం, పాఠశాల విద్య, పొదుపు సంఘాలు, తదితరాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా అబ్బెందవాస్లుకు గంగదేవిపల్లి సాధించిన విజయాలను జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో అబ్బెంద గ్రామ కమిటీ లీడర్ జగన్నాథ్, మొబిలైజర్ ప్రియారెడ్డి, టీం లీడర్ శివరాజ్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

- తెలంగాణ ఎలక్ట్రికల్ పవర్ సెక్టార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌చారి

నర్సంపేట రూరల్ : సమాజంలోని ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రికల్ పవర్ సెక్టార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఇనుగుర్తి శ్రీనివాస్‌చారి ఆకాంక్షించారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్–ఇండియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై 'లైటింగ్ ది వే–ఎ సస్టైనబుల్ ఫ్యూచర్' ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను వివరించారు. ఇంధన పొదుపు మార్గాలను అన్వేశించి క్షేత్రస్థాయిలో వాటి అమలుకు కృషి చేయాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఇంధన వనరుల వినియోగంతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఐఈ చైర్మన్ డాక్టర్ రాంచంద్రారెడ్డి, డాక్టర్ గిరిధర్, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిహరన్, ట్రిపుల్ ఈ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఏఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- 'ఎస్‌ఆర్‌ఆర్' చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని బీఆర్‌ఎస్ నేత, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి సహకారంతో సంక్రాంతి సందర్భంగా చేపట్టిన వరంగల్ ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు, యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు.

పరామర్శ

మండల కేంద్రానికి చెందిన జలగం రవి కుమారుడు అన్వేశ్ అనారోగ్యంతో అస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను బీఆర్‌ఎస్ నేత, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పరిపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రూ.10 వేల నగదుతోపాటు 50 కిలోల బియ్యం, 5 లీటర్ల మంచినూనె అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, మాజీ రైతుబంధు కమిటీ అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఓడబ్ల్యూ విలీన మహాసభ

నర్సంపేట : నేడు (శుక్రవారం) మంచిర్యాలలో పీఓడబ్ల్యూ విలీన మహాసభ నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి పూలక్క తెలిపారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో మహాసభ వాల్‌పోస్టర్లను గురువారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై, విద్యార్థినులపై, బాలికలపై దుర్మార్గాలు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. చట్టాలు సంపన్నులకు కొమ్ము కాస్తున్నాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యానికి అర్థం మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలపై బలమైన పోరాటాలు నిర్మించడానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, పీఓడబ్ల్యూ ఐక్యత సదస్సు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు శైలజ, సౌందర్య, సులోచన, రజిత, ప్రమీల, సువర్ణ, విజయ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి వెళ్లడానికి పాట్లు

- రోగులకు తప్పని తిప్పలు
- రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : పట్టణ శివారులోని పదెకరాల స్థలంలో మూడు బ్లాక్‌లతో ప్రభుత్వం నిర్మించిన పెద్దాస్పత్రికి వెళ్లడానికి రోగులకు, ఉద్యోగులకు, సిబ్బంది పాట్లు తప్పడం లేదు. ఆస్పత్రితోపాటు వైద్య, పారామెడికల్, నర్సింగ్ కళాశాలలకు వెళ్లే మట్టి రోడ్డు సరిగా లేక గుంతలమయమై వాహనాల రాకపోకలతో దుమ్మూధూళి లేచి రోగులు సతమతమవుతున్నారు. ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటరు దూరం వరకు మట్టి రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలంటే ప్రధానంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం ఆటోల్లో, ఇతర వాహనాల్లో వచ్చే రోగులు నడుం నొప్పి, ఆస్తమా, లాంటి ఇబ్బందులు పాలవుతున్నట్టు వ్యాఖ్యలు వినవస్తున్నాయి. పట్టణ శివారులో గత ప్రభుత్వం సుమారు రూ.150 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆస్పత్రితోపాటు వైద్య, పారామెడికల్, నర్సింగ్ కళాశాలలు నిర్మించి ఆర్భాటంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ఆస్పత్రికి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి ప్రతిరోజూ ఓపీలో చూపించుకోవడానికి వందలాది మంది రోగులు వస్తున్నారు. గర్భిణులకు ప్రసూతి సేవలు మాత్రమే పట్టణంలోని పాత ఆస్పత్రిలో అందిస్తుండగా మిగతా అన్ని రకాల రోగాలకు ఈ ఆస్పత్రిలోనే ఓపీ నిర్వహిస్తున్నారు. కాగా ఆస్పత్రికి వెళ్లే పాకాల రోడ్డు నుంచి సుమారు కిలోమీటరు మేర మట్టి రోడ్డుపై పాదచారులకూ తిప్పలు తప్పడం లేదు. వర్షాలు కురిసినప్పుడు మట్టిరోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలంటే రోగులు, వారి బంధువులు బెంబేలెత్తిన పరిస్థితి ఉంది. వాహనదారులై ప్రమాదానికి గురై మళ్లీ అదే ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకున్న ఘటనలూ ఉండడం కొసమెరుపు. కాగా ఆస్పత్రి ప్రారంభం నాటికే శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలన్న నాటి జిల్లా కలెక్టర్ ఆదేశాలను కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు తుంగలో తొక్కారన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా సమస్య పరిష్కరించాల్సిన అధికారులు ఇటీవల కొంత మేర మట్టి పోసి చేతులు దులుపుకున్నారన్న అపవాదు ఉంది. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని సత్వరమే సీసీ రోడ్డు నిర్మించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆస్పత్రికి వెళ్లే మట్టి రోడ్డు

టెండర్ పూర్తి కాగానే రోడ్డు వేయిస్తాం

ఆస్పత్రికి బీటీ రోడ్డు గతంలోనే మంజూరైంది. పలుమార్లు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ క్రమంలో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించింది. టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే రోడ్డు వేయిస్తాం.

– రాజేశ్, ఏఈ, మున్సిపాలిటీ

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

సంగెం : మండల కేంద్రంలోని గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రం (పీహెచ్‌సీ), గవిచర్లలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సెంట్రల్ టీమ్ గురువారం సందర్శించింది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ నుంచి మానిటరింగ్ టీమ్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి, సబ్‌సెంటర్ ద్వారా రోగులకు ఏయే సేవలందుతున్నాయి, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య ప్రోగ్రామ్‌లు గ్రౌండ్ లెవల్‌కు చేరుతున్నాయా.. లేదా పరిశీలించారు. ఆన్‌లైన్ ప్రక్రియను, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలు మెరుగైన వైద్యం అందించేందుకు ఇంకా మౌలిక వసతులు ఏమైనా అవసరం ఉన్నాయా? అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదిక కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అందిస్తామని టీమ్ లీడర్ డాక్టర్ శ్రవణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ సభ్యులు గాంధీగ్రామ్, వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మోహన్‌సింగ్, పీఓఎంసీహెచ్ డాక్టర్ పద్మ, డీపీఓ అర్చన, వైద్యాధికారి వంశీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

డ్రెయిన్ నిర్మాణంలో ఇరువర్గాల ఘర్షణ

నర్సంపేట రూరల్ : సైడ్ డ్రెయినేజీ నిర్మాణంలో రాజుకున్న గొడవ చినికిచినికి గాలివానగా మారింది. రాళ్లతో దాడులు చేసే పరిస్థితికి చేరింది. నర్సంపేట పట్టణంలోని 15వ వార్డు వడ్డెరకాలనీలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేటలోని వడ్డెర కాలనీ 15వ వార్డులో ఇటీవల సైడ్ డ్రెయినేజీల నిర్మాణం చేపడుతున్నారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ ఇంటి వద్దకు రాగానే సైడ్ డ్రెయినేజీ నిర్మాణానికి ప్రహరీ అడ్డంగా ఉందని తొలగించాలని కొందరు.. వద్దంటూ మరికొందరు ఇలా.. గొడవ ప్రారంభమైంది. ఈవిషయంలో ఒకరిపై ఒకరు దూషణలు, దాడులు చేసుకున్నారు. ఈవీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్సై గూడ అరుణ్‌ను వివరణ కోరగా.. 15వ వార్డులో గొడవ జరిగిన విషయం వాస్తవమేనని కానీ ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సంక్షేమ పథకాలు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సందీప్, నాయకులు

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు సందీప్

నర్సంపేట : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రధాని మోదీ అణగారిన వర్గాల ఉన్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ తెలిపారు. పట్టణంలోని వల్లబ్‌నగర్ ఎస్సీ కాలనీలో ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి సందీప్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో 2015 నంబర్ 26న తొలిసారిగా రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించారని గుర్తు చేశారు. నాటి నుంచి ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో డాక్టర్ అంబేడ్కర్ గౌరవార్థం పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాల ద్వారా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు కూనమల్ల పృథ్వీరాజ్, పట్టణ ఉపాధ్యక్షుడు ఠాకూర్ విజయ్‌సింగ్, పట్టణ కమిటీ కార్యదర్శి పానుగోటి రవీంద్రచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, ఉపాధ్యక్షుడు కొంకీస విఘ్నేశ్‌కుమార్, జిల్లా కార్యదర్శి అన్వేశ్, నాయకులు నాగేంద్రబాబు, ముత్యం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన సీఐ శ్రీనివాస్



నెక్కొండ : వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిశోర్ ఝాను స్థానిక సీఐ శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మీడియాతో మాట్లాడారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సీపీని కలిసినట్లు తెలిపారు. ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగ్గట్టు నీతి, నిజాయతీతో సేవలు అందించాలని సీపీ తనకు సూచించారని చెప్పారు.